ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



చిత్తూరు జిల్లా వార్తలు

ఆదివారం 29 జూన్ 2025

వెల్ఫేర్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్



బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి

చిత్తూరుఅర్బన్,జూన్28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. చిత్తూరు అంబేడ్కర్ భవన్‌లో సాంఘిక సంక్షేమశాఖ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఐదేళ్లు పూర్తయిన వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. మొదట విభిన్న ప్రతిభావంతులకు, స్పౌజ్ కేటగిరీ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థుల నుంచి ముందుగా తీసుకున్న ఆప్షన్లు, ఖాళీల ఆధారంగా సీనియారిటీ ప్రకారం కోరుకునే అవకాశాన్ని కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 485 పోస్టులకు 355 మందికి బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించినట్లు డీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో అన్ని పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సూపరింటెండెంట్లు మురుగేశ్, మురళి, సూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, సిబ్బంది పవన్, ధనశేఖర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఏఎస్‌డబ్ల్యూవోను సరెండర్ చేస్తాం: డీడీ

అంబేడ్కర్ భవన్‌లో జరిగిన బదిలీ కౌన్సెలింగ్ వచ్చిన వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చిత్తూరు ఏఎస్‌డబ్ల్యూవోను ప్రభుత్వానికి సరెండర్ చేస్తామని డీడీ తెలిపారు. అవసరమైన కుర్చీలు, తాగునీరు, మైక్ వసతి ఏర్పాటు చేయకపోవడంతో ఏఎస్‌డబ్ల్యూవో, చిత్తూరు యూనిట్ వార్డెన్లపై ఆయన మండిపడ్డారు. కాగా, కౌన్సెలింగ్ ప్రారంభమైన రెండు గంటలకు వెల్ఫేర్ అసిస్టెంట్లకు కుర్చీలను ఏర్పాటు చేశారు.

ఆర్‌కేవీవైపై పథకం కింద కిసాన్ డ్రోన్లు

చిత్తూరు సెంట్రల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ కేంద్ర వికాస్ యోజన (ఆర్‌కేవీవై) కింద జిల్లాలో 31 కిసాన్ డ్రోన్లు సబ్సిడీపై ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రోన్ యూనిట్ విలువ రూ.9.80 లక్షలు కాగా, 80 శాతం సబ్సిడీ రూ.7.84 లక్షలుపోను రైతు వాటా కింద రూ.1.96 లక్షలు చెల్లించాలన్నారు. 15 రోజుల తర్వాత ప్రభుత్వం అందించే రాయితీ రైతు సంఘం ఖాతాకు జమ చేయబడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ పనులకు కూలీల కొరత వేధిస్తోందని, పురుగు మందులు, నానో ఎరువులు పిచికారీకి డ్రోన్లు వాడుకుని, ఖర్చు తగ్గించుకోవచ్చని సూచించారు.

వీధిలైట్లు ఆపి నిరసన



చిత్తూరులోని రాజీవ్‌గాంధీ రోడ్డులో వెలగని వీధి లైట్లు

చిత్తూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలకసంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న కార్మికులు నగరంలో విద్యుత్ సరఫరాను ఆపివేసి నిరసన వ్యక్తం చేశారు.తమ సమస్యలను పరిష్కరించాలంటూ వారం రోజులుగా చిత్తూరు నగరపాలక కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో శనివారం సాయంత్రం చిత్తూరు నగరంలోని వీధి లైట్లను ఆపివేశారు.దీంతో వీధుల్లో అంధకారం నెలకొని జనం ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం స్పందించకపోతే సోమవారం నుంచి నీటిసరఫరాను కూడా ఆపివేస్తామని కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి హెచ్చరించారు.

సివిల్ కేసులపై న్యాయమూర్తులు అవగాహన పెంచుకోవాలి



వర్క్‌షాప్‌లో జస్టిస్ సురేష్ రెడ్డి, జిల్లా జడ్జి అరుణ సారిక తదితరులు

చిత్తూరు లీగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సివిల్ కేసులపై ప్రతి న్యాయమూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి సురేష్ రెడ్డి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం సివిల్ కేసులకు సంబంధించి వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ కేసులపై ప్రతి న్యాయమూర్తి అవగాహన కల్గి ఉండాలని చెప్పారు. ముఖ్యంగా సీపీసీ సెక్షన్ తొమ్మిది పరిధి, లోక్ అదాలత్ అవార్డుల అధికారంపై సుదీర్ఘంగా అధ్యయనం చేయాలన్నారు. న్యాయవ్యవస్థలో సమర్థత పెంపు, నైతిక విలువల పరిరక్షణపై కూడా స్పష్టమైన అవగాహనకు ఈ వర్క్‌షాపు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం సివిల్ కేసుల తీర్పులపై తీసుకోవాల్సిన జాగ్రతలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, విశ్రాంత జడ్జిలు జి.వి.కృష్ణయ్య, బాలాజి, రమేష్‌బాబు, న్యాయమూర్తులు శ్రీనివాస్, జయలక్ష్మి, అర్చన తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు సిద్ధం కండి

అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

చిత్తూరు సెంట్రల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఏర్పాట్లపై శనివారం క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. కడపల్లెలోని నివాసంలో సోమవారం రాత్రి బస చేయనున్న చంద్రబాబు మరుసటి రోజు ఉదయం ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తారని, బహిరంగసభలో పాల్గొని, స్టాళ్లను సందర్శిస్తారన్నారు. వివిధ శాఖల ద్వారా లబ్ధిదారులకు మెగా చెక్కులు, వివిధ ఆస్తి పనిముట్లు పంపిణీ చేస్తారని, వాటన్నింటినీ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.టాటా కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ సర్వే సెంటర్‌ను ప్రారంభించడంతో పాటు అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు.ఇందుకు తగిన విధంగా సిద్ధం కావాలని డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్‌లను ఆదేశించారు. డీపీవో, కుప్పం మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో ఆధ్వర్యంలో శాంతిపురం,కుప్పం మండలాల ప్రధాన కేంద్రాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ స్థలంలో బారికేడ్లు పటిష్ఠంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హెలిపాడ్ వద్ద , సీఎం పర్యటించే ప్రదేశాల్లో పటిష్ఠమైన భద్రత చేపట్టాలని సూచించారు. బహిరంగ సభ వద్ద తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్ర డీపీఆర్ తయారు చేసుకోవాలన్నారు. బహిరంగ సభ వద్ద జేసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కడా పీడీ వికాస్ మర్మత్,డీఆర్వో మోహన్‌కుమార్, కుప్పం ఆర్డీవో పాల్గొన్నారు.

బడి మానేసిన పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్

చిత్తూరు సెంట్రల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 6-14 ఏళ్ల మధ్య ఉన్న పిల్లల్లో బడి మానేసిన వారిని గుర్తించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఆదివారం నుంచి జూలై 12వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అర్హులైన పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లోని సౌకర్యాలను వివరించాలన్నారు. దీనికి గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు, సమగ్ర శిక్షలోని ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లు, అంగన్వాడీ వర్కర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు సహకరించాలని ఆదేశాలిచ్చారు.





■ శ్రీవారి సేవలో ప్రముఖులు

హెచ్‌కే పాటిల్ - సమీర్

తిరుమల, జూన్28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక మంత్రి హెచ్‌కే పాటిల్, సినీనటుడు సమీర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర

సూళ్లూరుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శనివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. వీక్షించిన భక్తజనులు పరవశించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో రథయాత్ర భక్తుల కోలాహలం.. హరేరామ సంకీర్తనల నడుమ.. చిన్నారుల వేషధారణలు, కోలాటం.. భక్తుల భజనలతో షార్ బస్టాండు నుంచి ప్రారంభమైన 4 కిలో మీటర్ల దూరం సాగింది. షార్ బస్టాండు వద్ద వందలాది మంది భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల మధ్య ఇస్కాన్ టెంపుల్ వారు పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రారంభమైన వెంటనే కారుమబ్బులు కమ్ముకుని ఒక నిమిషం పాటు ఆ ప్రాంతంలో తేలికపాటి జల్లుతో కూడిన వర్షం పడింది. ఇదంతా స్వామి మహిళ అని అక్కడి భక్తులు చర్చించుకోవడం కనిపించింది. ఫ్లైవోవర్ బ్రిడ్జి,



జీఎస్‌టీ రోడ్డు మీదుగా రథాన్ని ఊరేగించారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగుతూ భక్తిని చాటారు. చెంగాళమ్మ ఆలయం సమీపంలోని శ్రీనగర్ కాలనీ వద్ద యాత్రను ముగించారు. ఈ సందర్భంగా భక్తుల నృత్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.02 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,229

తలనీలాలు సమర్పించినవారు: 30,559



కథనం, ఇంటర్వ్యూ
తడ, సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి)

తమిళనాడు సరిహద్దు నియోజకవర్గం సూళ్లూరుపేట. అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన శ్రీహరికోట రాకెట్ కేంద్రం, జాతీయ పారిశ్రామిక విజయపతాకం శ్రీసిటీ, ప్రకృతి ప్రసాదించిన వరం పులికాట్ సరస్సు ఈ నియోజకవర్గం కీర్తి కిరీటాలు. ఈ రిజర్వుడు నియోజకవర్గంలో రాజకీయంగా నిలదొక్కుకోవడం ప్రతి నిత్యమూ ఒక సవాలే. స్టెతస్కోప్ చేతబట్టుకుని అమాయకంగా రాజకీయ ప్రవేశం చేసిన నెలవల విజయశ్రీ తొలి ఏడాదిలోనే గట్టి ఎమ్మెల్యే అనే పేరు తెచ్చుకున్నారు. జనంలో తిరుగుతూ, సమస్యలు తెలుసుకుంటూ, అసెంబ్లీలో ప్రస్తావిస్తూ, అధినేతకు విన్నవించుకుంటూ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది కాలంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఆమె సాధించినవీ, జనం ఆశిస్తున్నవీ, నెరవేర్చాల్సిన హామీల సమాహార సమీక్ష...



పులికాట్ ఫైలు కదిలింది!

- రూ.98కోట్లతో పూడికతీత పనులు మొదలవుతున్నాయి
- ఈ ఏడాదిలోనే మీజూరు చెక్‌డ్యాంల పనులు చేపడతాం
- అటవీ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నా ● కాళంగి గ్రాయిన్ ఫైలు కదిలింది

? ఈ ఏడాదిలో ఎమ్మెల్యేగా మీరు సూళ్లూరుపేట నియోజకవర్గానికి చేసిన పనులేమిటి

! సుమారు రూ.150 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాం. నిరంతరం ప్రజల్లో తిరుగుతూ ఉన్నపుడు కష్టాల్లో ఉన్న అనేకమంది తారసపడ్డారు. వీరికి సీఎం సహాయ నిధి నుంచి రూ.3 కోట్లు మంజూరు చేయించా.

● నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల్లో రూ.8.42 కోట్లతో పనులు చేపట్టాం. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రూ.5.62 కోట్లతో 29 పనులు చేయించాం. నాయుడుపేట మున్సిపాలిటీలో రూ.2.80 కోట్లతో 34 పనులు చేపట్టాం.





?

పులికాట్‌లో పూడికతీత అన్నది మా కలగానే మిగిలి పోయింది.ప్రభుత్వాలు మారుతున్నాయిగానీ పని జరగడం లేదు. ఎమ్మెల్యేగారూ.. మీరు కూడా గత నాయకుల లాగే ఎన్నికల సమయంలో పూడిక తీయిస్తామని హామీ ఇచ్చారు. నెరవేరుస్తారనే ఆశతో ఉన్నాం.

- జయచంద్రన్, మత్స్యకారుడు, బీపీ పాలెం, తడ మండలం

!

నేనిచ్చిన హామీని మరచిపోలేదు. పులికాట్ పూడికతీత గురించి సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం రూ.98 కోట్లు నిధులిచ్చింది. ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా టెండర్లు కూడా పిలిచారు. జూలైలో టెండర్లు ఖరారవుతాయి. వెంటనే పనులు మొదలవుతాయి.

-ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



?

చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే చెరువు కింద 14గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుందని మేమంతా ఎన్నికల సమయంలో మిమ్మల్ని కోరాం. మీరు కూడా సానుకూలంగా స్పందించారు. మాట నిలబెట్టుకోండి ఎమ్మెల్యేగారూ.

- చెంబేటి రామయ్య, రైతు, చెంబేడు, పెళ్లకూరు మండలం

!

ఇచ్చిన మాట నెరవేర్చి తీరుతాను. రూ.16 కోట్ల అంచనా వ్యయంతో చెంబేడు మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సీఎంవోకు పంపించాం.నిధుల కోసం సీఎం చంద్రబాబును అభ్యర్థించాం.ఈ ఏడాదిలో పనులు మొదలు పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నా.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



?

ఎమ్మెల్యేగారూ మీజూరు వద్ద చెక్‌డ్యాంలు కట్టిస్తామని ఎన్నికలకు ముందు మీరు హామీ ఇచ్చారు.చెక్‌డ్యాంలు కట్టిస్తే వాన నీరంతా పులికాట్‌లో కలిసిపోకుండా ఆగుతుంది.మీజూరు, వేలికాడు, నాగినేరి, కారికాడు, బేరుజంగాలపల్లి గ్రామాలకు చెందిన 7 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

-వి. వెంకటేశ్వర్లు, మీజూరు , దొరవారిసత్రం మండలం

!

2018లో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం మొదలుపెట్టింది. కేంద్ర అటవీ శాఖ అభ్యంతరాలతో పునాదుల దశలోనే పనులు ఆగిపోయాయి. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇపుడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును కోరాం.అటవీ శాఖ అనుమతులు కూడా తెప్పించి ఈ ఏడాదిలో పనులు చేపడతాం.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



?

పులికాట్‌లో ఉండే ఊరు మాది. కొరిడి-పేర్నాడు బాట బాగుంటేనే బయటి ప్రపంచంతో మాకు సంబంధాలుంటాయి. ఈ మట్టి రోడ్డులో ప్రయాణం అంటే నడుములు విరిగిపోతాయి. వాన కురిస్తే కాలు కూడా కదపలేం.గెలిస్తే తారు రోడ్డు వేయిస్తానని మీరు హామీ ఇచ్చారు. గెలిచారు. ఏడాది అయ్యింది. మమ్మల్ని పులికాట్‌కి వదిలేయద్దమ్మా అని వేడుకుంటున్నాం.

- ఆకాశ పాలెయ్య రాగన్న పట్టెడ, సూళ్లూరుపేట మండలం

!

ఈ రోడ్డును నేను వదిలేయలేదు. పర్యావరణ పరంగా ఇది సున్నితమైన ప్రాంతం. 23 కిలోమీటర్ల కొరిడి-పేర్నాడు తారు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతించడం లేదు. ఈ ప్రాంత ప్రజల కష్టాల గురించి అసెంబ్లీలో ప్రస్తావించాను.సీఎం, డిప్యూటీ సీఎంలను కలసి విన్నవించా. జూలైలో డిప్యూటీ సీఎంను మరోసారి కలసి అటవీ అనుమతులు తెప్పించేందుకు కృషి చేస్తా.ఈ ఏడాదిలోనే పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నా.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

1 ఏడాదిలో ఏం చేశారు?

సూళ్లూరు పేట ఎమ్మెల్యే

డాక్టర్ నెలవల విజయశ్రీ



ఐదేళ్ళ విరామం తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ తిరిగి ప్రారంభించిన దృశ్యాలు

సూళ్లూరుపేట నియోజకవర్గానికి ప్రపంచ పర్యావరణ, పర్యాటక రంగంలో గుర్తింపు తెచ్చిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పునరుద్ధరించే విషయంలో ఎమ్మెల్యే విజయశ్రీ కీలక పాత్ర పోషించారు. 2020 జనవరిలో చివరిసారిగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించగా తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చాకే ఈ ఏడాది జనవరిలో ఈ బర్డ్ ఫెస్టివల్‌ను తిరిగి ప్రారంభించింది. దీనికోసం విజయశ్రీ సీఎం చంద్రబాబును కలసి గట్టి ప్రయత్నం చేసి, ఘనంగా నిర్వహించారు.

కొరిడి-పేర్నాడు రోడ్డు దుస్థితి





గత వైసీపీ ప్రభుత్వంలో నాయుడుపేట పట్టణంలో విన్నమాల మెయిన్ రోడ్డు దుస్థితి



విన్నమాల మెయిన్ రోడ్డు ప్రస్తుత స్థితి

● నియోజకవర్గంలో అయిదేళ్లుగా అతీగతీ లేకుండా దారుణ స్థితిలో అనేక రోడ్లు కనిపించాయి. రూ.13.70 కోట్లతో 22 పనులు చేపట్టి 83.27 కి.మీ.ల ఆర్ అండ్ బీ రోడ్లు బాగు చేయించాం. పీఆర్ శాఖలో రూ.20.26 కోట్లతో 269 పనులు చేపట్టి 41.5 కి.మీ. సీసీ రోడ్లు వేయించాం. రూ.27.56 కోట్లతో తారు రోడ్లు వేయించాం. ఓజిలి కరబల్లవోలు రోడ్డు నుంచి అయ్యవారిపాలెం వరకూ రూ.8.38 కోట్లతో రోడ్డు వేయించాం. నాయుడుపేట ఎన్‌హెచ్ 16 నుంచి కమ్మవారిపాలేనికి రూ. 4.30 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నాం. నాయుడుపేట నుంచి చిగురుపాడు అగ్రహారానికి రూ.1.95 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నాం. తడ ఎంసీ రోడ్డు నుంచి బీవీ పాలేనికి రూ.63 లక్షలతో బీటీ రోడ్డు వేస్తున్నాం. రూ. 12.30 కోట్లతో పెళ్లకూరు మండలంలో కాళంగిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. ఇంకా రూ.1.05 కోట్లతో నాలుగు అంగన్‌వాడీ భవనాలు నిర్మించాం.ఐసీడీఎస్ ఆఫీసు భవనానికి మరమ్మతులు చేయించాం.పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో మొత్తం రూ.47.82 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

● తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చా. ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా రూ.12.19 కోట్లతో 176 పనులు పూర్తి చేయించాం. రూ.65.24 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశాం. తెలుగు గంగ కాలువల అభివృద్ధికి రూ.64.69 లక్షలతో 12 పనులు చేయించాం. రూ.4.31 కోట్లతో 187 గోకులం షెడ్లు నిర్మించాం. రూ.41.12 లక్షలతో బీసీ హాస్టళ్లను అభివృద్ధి పరిచాం.

● రూ.57.64 కోట్ల ఉపాధి హామీ నిధులతో 126 పనులు పూర్తయ్యాయి.

ఎమ్మెల్యే గారూ.. మీరిచ్చిన హామీలే ఇవి!

● సూళ్లూరుపేట సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తి చేసి తాగునీటిని అందించడం ● దొరవారిసత్రం మండలంలో 14 ఆర్ తెలుగు గంగ కాలువ నిర్మాణం పూర్తి చేయించడం ● నాయుడుపేట మండలం జువ్వలపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తి చేయించడం ● నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలో చెక్ డ్యాములు నిర్మించడం ● సూళ్లూరుపేట వద్ద కాళంగి నదిపైన, నాయుడుపేటలో స్వర్ణముఖి నదిపైన వంతెనల నిర్మాణం.



అసంపూర్తిగా వున్న సూళ్లూరుపేట సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం



4.47 కేజీల వెండి విరాళం

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి గుంతకల్లుకు చెందిన రాజు అనే వ్యాపారి 4.47 కేజీల వెండిని విరాళంగా సమర్పించారు. శనివారం దాత కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయానికి విచ్చేశారు. ఆలయ పరిపాలనా భవనంలో ఈవో బాపిరెడ్డిని కలిసి వెండి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతను ఘనంగా సత్కరించి, ప్రత్యేక దర్శనం కల్పించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆటోను గుర్తుతెలియని కారు ఢీకొట్టి వెళ్లడంతో 8 మంది గాయపడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పంచాయతీ కోళ్లఫారం సమీపంలో శనివారం సాయంత్రం పీఎస్ జాతీయరహదారిపై జరిగింది. బాధితుల కథనం మేరకు... శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి గ్రామానికి చెందిన మౌనిష్ అనే యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. 8 మంది కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం గూడూరు సమీపంలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి ఆటోలో వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి ఆటోలో బయలుదేరారు. కోళ్ల ఫారం దగ్గర జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు ఆటోను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆటో రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న మౌనిష్‌తోపాటు జాహ్నవి, సుబ్బయ్య, అంకమ్మ, విశాలాక్షి, అన్విత్(5) షర్మిల(4) గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనపై బాధ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

లారీని ఢీకొన్న కారు

● ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ నాగరాజు తెలిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మెహంతి సరస్వతి కుటుంబం హైదరాబాదులో నివాసం ఉంటోంది. శనివారం కుటుంబ సభ్యులందరూ కారులో హైదరాబాదు నుంచి తిరుమలకు బయలుదేరారు. పెళ్లకూరు మండలంలోని ఎగువచావాలి వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఓవర్‌టెక్ చేసి ముందు వెళ్తూ షడన్ బ్రేక్ వేసింది. దీంతో కారు లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మెహంతి సరస్వతి(50), ఆమె భర్త గోవిందరాజు, కుమార్తె సాయినవ్య, లహరి, చెల్లెలు మీన తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మెహంతి సరస్వతి మృతి చెందారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తి చేశాక బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న మల్లాది అనూష

సత్యవేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన అన్నమయ్య పంచామృత వర్షిణి కార్యక్రమం సంగీత ప్రియులను అలరించింది. హైదరాబాదుకు చెందిన ప్రఖ్యాత అన్నమాచార్య కీర్తనల పండితుడు గంధం బసవ శంకరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన కుమారి మల్లాది అనూష వాయిద్య కళాకారులతో కలిసి 'బ్రహ్మమొక్కటే, అదిగో అల్లదిగో, చక్కని తల్లికి, చిన్ని శిశువు' తదితర అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కాగా కీర్తనల ముందు శంకరరావు ఆ కీర్తనలకు సంబంధించిన సారాంశాన్ని, గొప్పదనాన్ని వివరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుపతి శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, ఎస్‌కే యూనివర్సిటీ మాజీ వీసీ కుసుమకుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి పల్లేటి బాలాజీ సమన్వయకర్తగా వ్యవహరించారు. శ్రీసిటీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సూళ్లూరుపేట, శ్రీహరికోట ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీపీటీవో



తిరుపతి(ఆర్టీసీ)/కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డీపీటీవోగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన జగదీష్ శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. కలెక్టర్ ఆయన్ను అభినందించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని, ప్రధానంగా రాబోవు శ్రీవారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

నాందేడ్-తిరుపతి మధ్య 16 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) జూన్28(ఆంధ్రజ్యోతి) తిరుపతిలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి నాందేడ్ -తిరుపతిల మధ్య 16 ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. కాగా 8 సర్వీసులు ఒక మార్గంలో, 8 సర్వీసులు మరో మార్గంలో నడపనున్నామని వెల్లడించారు. ఈ ప్రత్యేక రైళ్లు జూలై 4నుంచి 27వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయన్నారు. ● ఈ ప్రత్యేక రైలు(07189)నాందేడ్‌లో జూలై 4వ తేదీ శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి ముడికేడ్, దర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చర్ల, చర్లపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడుకుడి, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, వినుకొండ, దొనకొండ, మార్కాపురంరోడ్డు, కుంబ్యం, గిద్దలూరు, దేవరమిట్ట, నంద్యాల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు మధ్యాహ్నం 12.30గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. ● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07190) శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ ఆదివారం ఉదయం 9.30 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది. ● ఈ ప్రత్యేక రైలు(07015)నాందేడ్‌లో జూలై 5వ తేదీ శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి ముడికేడ్, దర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చర్ల, మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబుబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 10.10గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.

● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07016) ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైళ్లలో 1, 2, 3, ఏసీలతోపాటు సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు, సాధారణ కోచ్‌లు కూడా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హైదరాబాదులో పట్టుబడ్డ ఏనుగు దంతాలు

భాకరాపేటలో చోరీకి గురైనవేనా..?

● అటవీ శాఖలో కలకలం ● చోరీకి గురైన గన్ ఎక్కడ?

తిరుపతి (మంగళం) జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పోలీసులకు చిక్కిన ఏనుగు దంతాలు భాకరాపేట అటవీశాఖ రేంజ్ ఆఫీసులో చోరీకి గురైనవేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏనుగు దంతాలను తరలిస్తూ పట్టుబడ్డ డ్రైవర్ ప్రసాద్ అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందినవాడు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ ఫిబ్రవరిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కి జైలుకు కూడా వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ బస్సులో ప్రయాణిస్తున్న అతని వద్ద ఏనుగు దంతాలు లభించడం సంచలనమే సృష్టించింది. తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లోని అడవుల్లో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ హయాంలో ఏనుగులను చంపి వాటి దంతాలను స్మగ్లింగ్ చేశారు. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఏనుగులను వేటాడి చంపిన దాఖలాలు లేవు. తాజాగా ప్రసాద్ చేత పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడివి అనే ప్రశ్న అందరిరీ కలవరపాటుకు గురిచేస్తోంది. అటవీ శాఖ అధికారులు దీనిపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

విచారణాధికారిని నియమించాం : సీసీఎఫ్ సెల్వం

ఈ వ్యవహారంలో విచారణ అధికారిగా అన్నమయ్య జిల్లా డీఎఫ్‌ఓ జగన్నాథ్ సింగ్‌ను నియమించాం.హైదరాబాద్ పోలీసులతో కేసుకు సంబంధించిన ఫైల్ తెప్పించి పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడ నుంచి స్మగ్లింగ్ జరిగాయి అన్న దానిపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తాం.

భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో చోరీ..

2013లో తలకోన అటవీ ప్రాంతాల్లో రెండు ఏనుగులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. ఇందులో ఒక ఏనుగుకు సంబంధించిన దంతాలు పోస్టుమార్టం అనంతరం తొలగించి భాకరాపేట రేంజ్ ఆఫీసులో భద్రపరిచారు. అయితే 2023లో భాకరాపేట రేంజ్ ఆఫీసులో ఉన్న ఏనుగు దంతాలతో పాటుగా ఒక గన్ కూడా చోరీకి గురైంది. దీనిని గుర్తించిన అటవీశాఖ అధికారులు భాకరాపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కేసులో నిందితులు ఎవరో గుర్తించలేకపో యారు. అయితే ఈ చోరీ జరిగిన విషయం రహస్యంగా ఉంచారు. అటవీ శాఖ ఉన్నతాధికారులకు సైతం ఈ విషయం తెలుసా అన్నది అనుమానంగానే ఉంది. భాకరాపేట పోలీస్‌స్టేషన్లో 87-23 నంబర్‌తో కేసు కూడా నమోదైంది.

అటవీశాఖ అధికారులు గుబులు

దాదాపు ఒకటిన్నర సంవత్సరం తర్వాత భాకరాపేట రేంజ్ ఆఫీసులో అదృశ్యమైన దంతాలు హైదరాబాదులో పట్టుబడ్డ దంతాలు ఒకటేనేమో అన్న అనుమానంతో అటవీశాఖ అధికారుల్లో గుబు లు మొదలైంది. ఏనుగు దంతాలు, గన్ కావడంతో బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని అటవీ శాఖ అధికారులు భయపడ్డా నేడు బయట పెట్టడం అనివార్యంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో దొరికిన ఏనుగు దంతాలతో పాటు గన్ కూడా ప్రసాద్ వద్ద ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలో కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే రాక

చిత్తూరు సెంట్రల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి, సామాజిక న్యాయం సాధికారత మంత్రి రామ్‌దాస్ అథవాలే జూలై మూడో వారంలో జిల్లాకు రానున్నట్లు డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. కేంద్ర మంత్రి రాకపై సంబంధిత అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ప్రభుత్వ సంస్థ అలింకో సహకారంతో దివ్యాంగులకు జీవన పరికరాలు పంపిణీ చేయనుందని, చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సభా ప్రాంగణంలో ప్రతి స్టాల్ వద్ద దివ్యాంగులకు వీల్‌చైర్లు, భోజనం, తాగునీటి సదుపాయాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

ముగిసిన వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్


బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు, హాజరైన సచివాలయ ఉద్యోగులు



చిత్తూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. శనివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియను కమిషనర్ నరసింహప్రసాద్ పర్యవేక్షించారు. చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లె, కుప్పం, పుంగనూరు, పలమనేరు, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకుని వారికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారినుంచి ఆప్షన్ ఫామ్స్ తీసుకున్నారు. రెండో రోజు జరిగిన కౌన్సెలింగ్‌కు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శులు 184 మంది, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 192 మంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు 143 మంది, రిక్వెస్టు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్న 38 మంది హాజరయ్యారు. తిరుపతి, చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్లు చరణ్‌తేజరెడ్డి, ప్రసాద్, ఉమ్మడి జిల్లాల కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమకాటుతో వచ్చే రోగాలపై అవగాహన కల్పించండి: డీఎంహెచ్‌వో


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దోమకాటుతో వచ్చే రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సుధారాణి సూచించారు. శనివారం తన కార్యాలయంలో మేల్ ఆరోగ్య కార్యకర్తలకు ఆరోగ్య సేవలపై ఒక్కరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీలకు వచ్చే అనుమానిత రోగులకు రక్తపరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. ప్రతినెలా కనీసం 20 రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపాలని చెప్పారు. డీఎంవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్తకు రిమాండు

పాలసముద్రం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని తిరుమలరాజుపురం పంచాయతీ కొండకాలువలో నివసిస్తున్న ప్రమీలపై అనుమానంతో ఆమెను భర్త కార్తీక్ శుక్రవారం సాయంత్రం చంపేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమీల మృతదేహానికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అయ్యాక బంధువులకు అప్పగించారు. నిందితుడైన భర్తను అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప శనివారం తెలిపారు.

దోబూచులాడుతున్న రుతుపవనాలు

● ఆందోళనలో అన్నదాతలు


దుక్కి దున్ని వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు

పుత్తూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇదిగో రుతుపవనాలు.. అదిగో వర్షాలంటూ వాతావరణ శాఖాధికారుల ప్రకటనలను నమ్మిన రైతన్నలకు నిరాశే మిగులుతోంది. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి నెలలోనే ప్రారంభం అవుతుంది. దీంతో రైతులు మే నెలలో కురిసిన తొలకరి వర్షాలతో సాగుకు సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది జూన్ మాసం పూర్తవుతున్నప్పటికీ వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా పుత్తూరు మండలంలో 116 మి.మి వర్షం పడాల్సి ఉండగా, ఇప్పటికీ 62 మి.మి మాత్రమే పడింది. దీనికితోడు వాతావరణ శాఖాధికారులు చేసిన ప్రకటనలతో రైతన్నలు సంతోష పడినప్పటికీ రుతుపవనాలు కానరాకపోవడంతో దుక్కులు దున్ని, ఆకాశం వైపు వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ సీజన్‌లో సాధారణంగా వరి, వేరుశనగ, సజ్జలు అధిక మొత్తంలో పండిస్తారు. మండల పరిధిలో బోర్లు, బావులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు కావాల్సినంత నీరు ఒక్క వర్షపాతం ద్వారానే సాధ్యమవుతుంది. ఇప్పటికి కూడా వర్షాల పడకపోవడం, వేసవిని తలపించేలా ఎండలు మండుతుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

రేపటి నుంచి సాక్షాత్కార వైభవోత్సవాలు

చంద్రగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం నుంచి జూలై 2వ తేదీ వరకు సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయంలో విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టారు. పెద్దశేష, హనుమంత, గరుడ వాహనాలను సిద్ధం చేశారు. సోమవారం రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై స్వామివారు విహరించనున్నారు. జూలై 1న హనుమంత వాహనంపై, 2న గరుడ వాహనంపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు.జూలై 3వ తేదీ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ మధ్యాహ్నం 2 గంటల వరకూ పార్వేట ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆస్థానం, వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఈనెల 30 నుంచి జూలై 3వ తేదీ వరకూ నిత్య కల్యాణోత్సవం, తిరుప్పావడ సేవ, స్వర్ణపుష్పార్చన, అష్టోత్తర శతకలశాభిషేకం సేవలను రద్దు చేసినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

టమోటా ధరలపై రైతుల ఆశలు


పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

పలమనేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. గత 8 నెలలుగా టమోటా ధరలు గణనీయంగా పడిపోయాయి. సాధారణంగా ఏప్రిల్, మే మాసాల్లో తప్పక టమోటా ధరలు పెరుగుతుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. అయితే జూన్ 15 వరకు టమోటా కిలో రూ.10 వరకు పలుకుతుండేది. అయితే ఆ ధరలు పెరుగుతూ వచ్చాయి. గత ఆరు రోజులుగా టమోటా ధరలు కొంత నిలకడగానే పలుకుతున్నాయి. ఈనెల 23న పలమనేరు మార్కెట్‌లో కిలో కనీస ధర రూ.13.70, గరిష్ట ధర రూ.24.70, 24న టమోటా కిలో కనిష్ట ధర రూ.21.60 , గరిష్ట ధర రూ. 24.70, 25న టమోటా కిలో కనిష్ట ధర రూ.17, గరిష్ట ధర రూ.23, 26న టమోటా కిలో కనిష్ట ధర రూ.16, గరిష్ట ధర రూ.20, 27న టమోటా కిలో కనిష్ట ధర రూ.17.80, గరిష్ట ధర రూ.21, శనివారం టమోటా కిలో కనిష్ట ధర రూ.17.70, గరిష్ట ధర కిలో రూ.21.50 పలికాయి. 15 కిలోల టమోటా బాక్సు ధర రూ.300లకు చేరుకుంది. అయితే మళ్లీ ఇప్పుడు వర్షాలు కురిస్తే తోటల్లోనే టమోటాలు మాగిపోయి మార్కెట్ కు పెద్ద ఎత్తున తీసుకొస్తే మాత్రం మళ్లీ బాక్సు టమోటాల ధరలు రూ.150 లకు పడిపోయే ప్రమాదం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. వారం క్రితం వరకు పలమనేరు మార్కెట్‌యార్డుకు 400 మెట్రిక్ టన్నులకు పైగా రోజూ టమోటాలు వస్తుండగా.. గత మూడు రోజులుగా తక్కువగా వస్తున్నాయి. శనివారం పలమనేరు మార్కెట్‌కు 380 టన్నుల టమోటాలను రైతులు విక్రయించేందుకు తీసుకొచ్చారు.

జైన్ ఫ్యాక్టరీకి నేడు మామిడికాయలు తీసుకురావొద్దు




మామిడి కాయలు తీసుకురావద్దని జైన్‌ఫ్యాక్టరీ-2 గేటు వద్ద పెట్టిన నోటీసు బోర్డు - ఫ్యాక్టరీ వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు

గంగాధరనెల్లూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడికాయలను రైతులెవరూ ఆదివారం సాయంత్రం వరకు జైన్ ఫ్యాక్టరీ-2 వద్దకు తీసుకురావద్దని యాజమాన్యం ఓ నోటీసు బోర్డును ఈనెల 26వ తేదీనే ఏర్పాటు చేసింది.అయినా గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లె వద్ద ఉన్న జైన్‌ఫ్యాక్టరీ-1, తూగుండ్రంకు వెళ్లే రహదారికి పక్కన ఉన్న జైన్ ఫ్యాక్టరీ-2 వద్దకు మండలంలోని వారేకాకుండా వివిధ ప్రాంతాలకుచెందిన రైతులు తోతాపురి మామిడికాయలను ట్రాక్టర్లలో తీసుకొచ్చి రోడ్లపక్కన వరుసగా నిలబెడుతున్నారు. శనివారం సాయంత్రానికి జైన్‌ఫ్యాక్టరీ-2వద్ద 232ట్రాక్టర్లు మామిడికాయలలోడ్లతో వేచి ఉన్నారు. దీనిపై రైతులు, ట్రాక్టర్ల డ్రైవర్లను విచారించగా.. కాయలు తీసుకొచ్చి మూడో రోజు అవుతున్నట్లు తెలిపారు. మరోవైపు జైన్‌ఫ్యాక్టరీల వద్ద డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, హార్టికల్చర్ డీడీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో కృష్ణమహేశ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.

పంచాయతీలకు రూ.60 కోట్ల బకాయిలు

●ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి ఆదుకోవాలని సర్పంచుల విన్నపం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో కొనసాగే అభివృద్ధి పనులకు ఆర్థిక సంఘం నిధులు దన్నుగా నిలబడుతుంటాయి. అయితే ఆర్థిక సంఘం నిధులు చాలానెలలుగా విడుదల కావడం లేదు. పంచాయతీ ఖాతాల్లో జమచేయడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. నేడో రేపో నిధులు విడుదల అవుతాయని సర్పంచ్‌లు నెలలు తరబడి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళి నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

2019-20లో ప్రారంభమైన 15వ ఆర్థిక సంఘం నిధులు 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు విడతలవారీగా ఉమ్మడిజిల్లాలోని పంచాయతీలకు విడుదలవుతూ వచ్చాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం వాటిని దారి మళ్ళించింది. కరెంటుబిల్లు బకాయిలకంటూ మొత్తం నిధులను దారి మళ్ళించడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. 2024-25వ ఆర్థిక సంవత్సరంలో చిత్తూరు జిల్లాలోని ఎన్నికలు జరగని 13 మినహా మిగిలిన 683 పంచాయతీలకు మొదటి విడతగా రూ. 30.32 కోట్లు విడుదల చేసింది. టైడ్ కింద రూ.18,19,64,239, అన్‌టైడ్ విభాగం కింద రూ.12,13,09,481 విడుదలయ్యాయి. వీటితో పాటు ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో వందలాది కిలోమీటర్ల డ్రైన్లు, సీసీ, బీటీ రోడ్లను అభివృద్ధి చేశారు. కానీ ఆపై రెండో విడత నిధులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఐదు నెలల కిందటే విడుదల చేసింది. అయినా ఈ మొత్తాలు ఇంతవరకు పంచాయతీలకు జమకాలేదు.

● టైడ్, అన్‌టైడ్ నిధులతో పనులిలా

15వ ఆర్థిక సంఘం టైడ్, అన్‌టైడ్ నిధులుగా విడుదల చేస్తుంది. నేరుగా గ్రామపంచాయతీల ఖాతాలకే జమవుతాయి. వీటిలో టైడ్ నిధులను రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు వినియోగిస్తారు. అన్‌టైడ్ నిధులను కేవలం పారిశుధ్య పనులు, వీధిదీపాలు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు వినియోగించడానికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ నిధులు జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు విడుదల చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

● బకాయిలు రూ.60.64 కోట్లు

గత ఏడాది ఆర్థిక సంఘం నిధుల బకాయిలు రూ.30.32 కోట్లు మేర విడుదల కావాల్సివుంది. 2025-26వ ఆర్థిక సంవత్సరం తొలివిడతగా మరో రూ.30.32 కోట్లు వెరసి మొత్తంగా రూ.60.64 కోట్లు విడుదల కావాల్సివుంది.

జాయింట్ ఎల్పీఎం టెన్షన్ వద్దు

రేపటివరకు రైతులకు వెసులుబాటు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేలోని తప్పిదాల వల్ల జాయింట్ ఎల్పీఎం (ల్యాండ్ పార్శల్ మ్యాప్) లతో చిక్కులు ఏర్పడ్డాయి. 2022-24 సంవత్సరాల మధ్య సర్వే పూర్తయిన వెబ్‌ల్యాండ్ 2.0 జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు తమ భూములపై తరచూ వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో రైతులు ప్రభుత్వ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పలు పథకాల లబ్ధికి అడ్డంకులు ఏర్పడ్డాయి. భూములకు సంబంధించిన ఒక సర్వే నెంబర్‌లో ఎక్కువమంది భూముల ఖాతాలు కలిపి ఉండడం వల్ల ఆన్‌లైన్‌లో ఒకే భూమి అందరికీ ఒకే మొత్తంలో కనిపించడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి.గత వైసీపీ ప్రభుత్వంలో డ్రోన్ల సాయంతో రీసర్వే చేశారు. ఈ మేర అప్పట్లో 319 గ్రామాల్లో డ్రోన్ రీసర్వే జరిగింది. ఈ క్రమంలో ఒక సర్వే నెంబరులో ఎంత విస్తీర్ణం భూమి ఉందో, వాటన్నింటినీ కలిపి ఒకే ల్యాండ్ పార్శల్ మ్యాప్ (ఎల్పీఎం) ను కేటాయించడంతో క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం ద్వారా రోవర్లను ఉపయోగించి భూముల సర్వే చేస్తుండడంతో లెక్కలు సరిగ్గా తేలుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా సర్వేపూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు వారి భూముల విభజనను చేసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుము రూ.500 పూర్తిగా మినహాయించి ఉచితంగా ఈ సేవలు పొందేందుకు అవకాశం కల్పించింది. ఈ సేవలను పొందేందుకు కేవలం నామమాత్రపు దరఖాస్తు రుసుం రూ.50 గ్రామసచివాలయాల్లో చెల్లించి దరఖాస్తు చేసుకోవడానికి 30వ తేదీ వరకూ అవకాశం కల్పించింది.ఈ సమస్యలను పరిష్కరించి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల లబ్ధి పొందేందుకు జాయింట్ ఎల్పీల సమస్యలను పరిష్కరించేందుకు రెవిన్యూశాఖ చర్యలు చేపట్టింది. వాస్తవ భూములను నమోదు చేయాలని విద్యార్థుల కుటుంబాలు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. జేసీ ఆదేశాలమేరకు రూ.50రుసుముచెల్లించి వాస్తవంగా ఉన్న భూమికి సంబంధించిన ఆధారాలు, అసలు తమ పేరిట భూమి లేకపోతే లేనట్లుగా వీఆర్వోల సర్టిఫికెట్లు సచివాలయాల్లో గ్రామ సర్వేయర్లకు అందజేస్తే వెబ్‌ల్యాండ్ సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లాఅధికారులు తెలిపారు.

ఏర్పేడు హౌసింగ్‌లో స్టీల్ గోల్‌మాల్

● రూ.34 లక్షల విలువైన 44 టన్నులు మాయం

● వైసీపీ హయాంలో జరిగినట్లు గుట్టురట్టు

ఏర్పేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. 34 లక్షల రూపాయల విలువైన స్టీల్‌ను అప్పటి అధికారులు స్వాహా చేశారు. ఇందులో ఎవరి పాత్ర ఏమిటో విచారణలో నిగ్గు తేల్చాల్సి ఉంది. గత వైసీపీ పాలనలో అవుట్ సోర్సింగ్ కింద హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న అమర్నాథ్‌ను మండల హౌసింగ్ ఏఈగా నియమించారు. ఆయన 2023 ఫిబ్రవరి నుంచి 2025 మార్చి 14వ తేదీ వరకు మండలంలో పని చేశారు. చివర సంవత్సరంలో వంద టన్నుల స్టీల్ కావాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఆ మేరకు గోడౌన్ నుంచి స్టీలు మండలానికి తెప్పించుకున్నాడు. అందులో 56 టన్నులను మాత్రమే హౌసింగ్ లబ్ధిదారులకు పంపిణీ చేశాడు. మిగిలిన 44 టన్నులను స్వాహా చేశారు. దాని విలువ 34 లక్షల రూపాయలుగా ఉంది. ఇది అప్పటి ప్రజాప్రతినిధుల అండదండలతో వారి కనుసన్నల్లోనే జరిగినట్లు తెలుస్తోంది.

● వెలుగులోకి వచ్చిందిలా..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైసీపీ పాలనలో జరిగిన ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. 44 టన్నుల స్టీలు గోల్‌మాల్ జరిగినట్లు తేలింది. కాగా, ఏ అధికారులైతే అవినీతి జరిగినట్లు గుర్తించారో వారే దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి దీనికి వెనుక ఎవరు ఉన్నారనేది నిగ్గు తేల్చాల్సి ఉంది. కాగా, మండల స్థాయి నాయకులు హౌసింగ్ అధికారులను ప్రలోభాలకు గురిచేసి స్టీల్‌ను తమ ఇళ్లకు తరలించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేపట్టిన హౌసింగ్ డీఈ త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశముంది.

ట్రాఫిక్ నియంత్రణకు 16 ద్విచక్రవాహనాలు


బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణకు జిల్లాకు 16 ద్విచక్రవాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఈ వాహనాలను సాయుధ దళ కార్యాలయంలో శనివారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. జిల్లాలో ఎక్కడైనా ట్రాఫిక్ స్తంభించినప్పుడు వెంటనే అక్కడకు వెళ్లి సమస్యను పరిష్కరించడానికి ఈ వాహనాలు సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. ఈ వాహనాలను ప్రధాన రహదారులుండే పోలీసు స్టేషన్లకు, నగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు కేటాయించామన్నారు. అనంతరం ఏఎస్పీ రాజశేఖర్‌రాజు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించగా ఎస్పీ హాజరై.. ద్విచక్ర వాహనాన్ని నడిపారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, సీఐ మహేశ్వర, అడ్మిన్ ఆర్ఐ సుధాకర్, ఎంటీవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించండి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి మొబైల్ యాప్‌తో కలిగే ఉపయోగాలపై గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, రోడ్‌సేఫ్టీ, శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏఎస్పీ ప్రసంగించారు. మానసిక ఆరోగ్యం, రోడ్‌సేఫ్టీ తదితర అంశాలపై ఒకటో పట్టణ సీఐ మహేశ్వర అవగాహన కల్పించారు. మహిళా ఎస్ఐ నాగసౌజన్య, ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి, అపోలో ఆస్పత్రి డాక్టర్ జయ ప్రియా తదితరులు పాల్గొన్నారు.

101 మందితో ఒప్పందాలు

● కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు విజయవంతం



ఎంఓయూలు చేసుకుంటున్న కొనుగోలు, అమ్మకందారులు

తిరుచానూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు విజయవంతమయ్యాయని ఏపీ ఎంఎస్‌ఎంఈ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్‌బాబు, ఎఫ్ఐఈఓ జాయింట్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ తెలిపారు. మొత్తం 101 ఎంఓయూలు కుదిరినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎంఎస్‌ఎంఈ డీసీ), భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈఓ) ఆధ్వర్యంలో తాజ్‌హోటల్ వేదికగా మూడు రోజులపాటు జరిగిన కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు శనివారంతో ముగిశాయి. వారు మాట్లాడుతూ 40 మంది ఎగుమతిదారులు, 38 మంది మహిళా వ్యవస్థాపకులతో 101 ఎంఓయూలు కుదిరినట్టు వివరించారు. ఈ అవగాహనా ఒప్పందాలు ఎంఎస్‌ఎంఈలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పీఓ), చేతివృత్తులవారు, నేత సంఘాలకు అంతర్జాతీయ వాణిజ్యఅవకాశాలను మరింతగా పెంపొందిస్తుందని వివరించారు.

వృత్తిలో సేవా దృక్పథం అవసరం





డాక్టర్ సుధీర్‌ను సత్కరిస్తున్న బీసీఎన్ తదితరులు, ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కుప్పం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చేసే వృత్తి ఏదైనా అందులో సేవా దృక్పథం అవసరమని బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్, సెక్రటరీ ఎన్.సాగర్‌రాజ్ అన్నారు. కుప్పం నర్సింగ్ కళాశాలలో శనివారం జీఎన్ఎం విద్యార్థులకు జ్యోతి ప్రజ్వలన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వీరు మాట్లాడుతూ వృత్తిలో సేవా దృక్పథం అలవర్చుకుని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను పొంది భవిష్యత్తుకు బంగారు బాటలు నిర్మించుకోవాలన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విమల విద్యార్థులచే ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తరగతులను విలీనం చేయొద్దు



రహదారిపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేయొద్దని మండలంలోని మిట్టపల్లె గ్రామస్తులు విద్యార్థులతో కలిసి శనివారం బైరెడ్డిపల్లె - పలమనేరు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. తమ పిల్లలు వేరే పాఠశాలకు వెళ్లిరావడం ఇబ్బందికరంగా ఉంటుందని - మిట్టపల్లెలోనే యథావిధిగా తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థులకు ఘన సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రాఫిట్ షూ కంపెనీ యజమాన్యం

పుంగనూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రాఫిట్ షూ కంపెనీ యజమాన్యం శనివారం ఘనంగా సన్మానించింది. స్థానిక బాలికోన్నత ఉన్నత పాఠశాలలో చదివిన రెడ్డిప్రసన్న (589), కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో చదివిన శిల్ప (586)లను సన్మానించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో పాటు బ్యాగులు, చెప్పులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో రెడ్డెన్నశెట్టి, కంపెనీ మేనేజర్ శివాజీ, పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



విద్యాసామగ్రిని అందజేస్తున్న ఎంఈవో శిద్దరామయ్య

కల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య సాధ్యమని ఎంఈవో శిద్దరామయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు శనివారం పీలేరుకు చెందిన సాయి కంటి ఆస్పత్రి అధినేత రమేష్‌బాబు ఉచితంగా విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకురావాలన్నారు. హెచ్ఎంలు లోకనాథరెడ్డి, శాంతి, ఉపాధ్యాయులు మాధవి, జవహర్ ఆలీషా, హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు పెద్దపీట



చంద్రబాబు, పవన్ కల్యాన్, లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

గుడుపల్లె, జూన్ 28 (ఆంధజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని టీడీపీ నేతలు బాబునాయుడు, చంద్రశేఖర్, మునిరాజు, డాక్టర్ వెంకటేష్ తెలిపారు. శనివారం ద్రావిడ వర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో టీడీపీ శ్రేణులు వర్సిటీలో సంబరాలు చేసుకొన్నారు. మొదటగా నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రాబోయే రోజుల్లో కుప్పం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నేతలు హేమాంబర్ గౌడు, అమీర్, రామచంద్ర, సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, గోపాల్, గోవిందస్వామి, అనుసూయ, వాసు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

● రూ.20 వేలు నగదు, 8 ద్విచక్ర వాహనాల స్వాధీనం

కల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట సమీపంలోని రిజర్వు ఫారెస్టులో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు శనివారం కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు కల్లూరు సీఐ సూర్యనారాయణ, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. దాడుల్లో ముగ్గురు పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.20 వేలు నగదు, 8 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుంగనూరు నోబుల్ అడ్వైజర్‌గా సురేశ్

పుంగనూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ లియో క్లబ్ ఆఫ్ పుంగనూరు నోబుల్ అడ్వైజర్‌గా పుంగనూరుకు చెందిన సురేశ్‌ను ఎంపిక చేసినట్లు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఫ్యాబ్రిషియో ఒలివేరా ఓ ప్రకటనలో తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



భువనేశ్వరి

చౌడేపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీకి స్థానిక హైస్కూల్ విద్యార్థిని భువనేశ్వరి ఎంపికైనట్లు హెచ్ఎం నాగరాజరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే పదో తరగతి చదువుతున్న విద్యార్థిని జాహ్నవి నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థినికి ఏటా రూ.12 వేలు చొప్పున ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు అందించనున్నట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు

పుంగనూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరహార దీక్షలు చేస్తున్న వారికి మద్దతుగా దీక్షలో కూర్చొని నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు అయాబ్‌బాషా, ముబారక్, మోసిన, ఫయాజ్, కార్మికులు శ్రీరాములు, సుదర్శన్‌రాజు, కుమార్, జవహర్ అలీ, భాను, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలి

శాంతిపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తోతాపురి మామిడి రైతులు సచివాలయాల్లోని రైతు సేవా కేంద్రాలలో ఆధార్ వివరాలను నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారి వింధ్యా తెలిపారు. తోతాపురి రకం మామిడి కాయలకు ధరలు లేక పోవడంతో రైతులు నష్టపోకూడదని ప్రభుత్వం కిలోకి రూ.4 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఆ డబ్బులు రైతులకు అందాలంటే మామిడి కాయలు కోసిన తరువాత గుజ్జు పరిశ్రమలకు, మండీలకు, ర్యాంపులకు తరలించినపుడు అక్కడ నియమించిన అధికారులతో పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకాల జిరాక్సులు అందించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలు నమోదు చేసుకున్న వారికి మాత్రమే మద్దతు ధర నగదు పడుతుందన్నారు ఈ అవకాశాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జాండ్లవారివారిపల్లె సర్పంచ్ ఆత్మహత్య



నాగిరెడ్డి (ఫైల్ ఫొటో)

రొంపిచెర్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం జాండ్లవారిపల్లె పంచాయతీ సర్పంచ్ నాగిరెడ్డి ఆత్మహత్య చేసుకొని మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ కథనం మేరకు... జాండ్లవారిపల్లె పంచాయతీకి చెందిన నాగిరెడ్డి సర్పంచ్‌గా పనిచేస్తూ ఈనెల 24న మంగళవారం ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లాడు. గ్రామ సమీపంలోని వడ్డిపల్లెగుట్టలో చెట్టుకు ఉరేసుకొని ఉండటాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నాలుగు రోజుల క్రితమే ఉరేసుకొని ఉండటంతో మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడి కుమారుడు కిషోర్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అక్రమ విద్యుత్ వినియోగదారులపై కేసు నమోదు

చౌడేపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు డిటక్షన్ ఆఫ్ ప్రివరేషన్ ఎనర్జీ అధికారులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాటిపేరి, అగిస్థిగానిపల్లె, ఓడ్డిపల్లెల్లో 11 మందిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఈ వింగ్ విజిలెన్స్ సిబ్బంది, ఏఈ శశిధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు



పుంగనూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి పుంగనూరు సమీపంలోని నక్కబండలో జరిగింది. పట్టణ సమీపంలోని నక్కబండకు చెందిన రుక్సానా కుమారుడు జిషాన్(7) శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఆడుకుంటుండగా ఆటో ఢీకొంది. ప్రమాదంలో జిషాన్ తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

కందూరు వైద్యాధికారిగా రాజ్‌కుమార్

సోమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కందూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా రాజ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి డాక్టర్ నీలిమా అన్నమయ్య జిల్లా చిన్నగొట్టిగల్లుకు బదిలీ అయ్యారు. రామకుప్పం మండలం వీర్నమల పీహెచ్‌సీలో విధుల్లో ఉన్న రాజ్‌కుమార్ కందూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందజేస్తానని తెలిపారు.

కొలమాసనపల్లి విద్యార్థుల ప్రతిభ



పి.చిత్ర



హేమంత్‌కుమార్

పలమనేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కొలమాసనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని చిత్ర ట్రిపుల్ ఐటీకి, హేమంత్‌కుమార్ ఏపీఆర్‌జేసీకి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ధర్మేంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని చిత్ర పదో తరగతిలో 573 మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి, హేమంత్‌కుమార్ ఏపీఆర్‌జేసీ గ్యారంపల్లికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

రహదారులు బాగుపడుతున్న వేళ!

● కుప్పంలో జోరుగా సిమెంటు రోడ్ల నిర్మాణం





కొత్తపేటలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కన్నన్ తదితరులు, చందం హరిజనవాడకు సిమెంటు రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో చిరకాలంగా ఉన్న సమస్యలు తొలగుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన వర్గాలు, ప్రాంతాలు ఒక్కటొక్కటే బాగు పడుతున్నాయి. ఈ బాగుపడే క్రమంలో ఆయా ప్రాంతాలకు సిమెంటు రోడ్ల నిర్మాణం ఊపందుకుంటోంది. చిరకాలంగా దారిలేని శ్మశానం, గుంతలు తేలిన పట్టణ రహదారి ఈ సిమెంటు రోడ్లతో అభివృద్ధికి నోచుకుంటున్నాయి.

కుప్పం మండలం చందం పంచాయతీ హరిజనవాడ శ్మశానానికి ఇంతవరకు రోడ్డు లేదు. సిమెంటు రోడ్డు కాదు కదా.. ఉన్న దారి నడవలేని స్థితిలోకి చేరిపోయింది. ఎంతోకాలంగా ఇక్కడి దళితులు శ్మశానానికి రోడ్డు కావాలని ఎన్నోసార్లు వినతులు ఇస్తూనే ఉన్నారు. అటు అధికారులను, ఇటు ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించుకుంటూనే ఉన్నారు. అయినా వారి మొర ఆలకించేవారే లేకపోయారు. వైసీపీ ఐదేళ్ల పాలనా కాలంలో కుప్పం నియోజకవర్గం మరింత అలక్ష్యానికి గురైంది. ప్రధాన సమస్యలే పట్టించుకోనప్పుడు ఇక హరిజన వాడకు రోడ్డు సంగతి గురించి ఎవరాలోచిస్తారు. అయితే 2024లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల వినతులకు పరిష్కారం లభిస్తోంది. వచ్చాక జిల్లా కలెక్టర్ తరచూ ఇక్కడ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతోంది. మరోవైపు టీడీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఓ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి ప్రజల సమస్యలపై నేరుగా బాధ్యత తీసుకొని పరిష్కారానికి అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. ఈ క్రమంలో చందం పంచాయతీ హరిజనవాడ శ్మశానానికి రహదారి భాగ్యం లభించింది. ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షలతో పక్కా సిమెంటు రోడ్డు మంజూరైంది. కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఇతర స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శనివారం భూమి పూజ చేశారు. మరోవైపు కుప్పం పట్టణంలోని కొత్తపేటలోనూ సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ శనివారం నాడే జరిగింది. కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కుప్పం నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తపేటలో నేతాజీ రోడ్డు కూడలి నుంచి రాజీవ్ కాలనీ కూడలి వరకు ఉన్న ఈ రహదారి గుంతలు పడి కంకర తేలి అస్తవ్యస్తంగా ఉండిపోయింది. పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కుప్పం నియోజకవర్గంలోని రహదారులు-భవనాల శాఖ రహదారుల నిర్మాణం, పునరుద్ధరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.53 కోట్లు మంజూరు చేశారు.

కుప్పం పర్యటనకు వచ్చిన సమయంలో అక్కడికక్కడే జీవో విడుదల చేశారు. అప్పుడు సమర్పించిన పనుల జాబితాలో ప్రస్తుతం నిర్మాణమవుతున్న కొత్తపేట రోడ్డు ఒకటి. రూ.40 లక్షల అంచనా వ్యయంతో జాబితాలో పొందుపరిచిన ఈ రోడ్డును ప్రస్తుతం రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. నియోజకవర్గంలోని ఇంకా పలు గ్రామీణ రహదారులు, ఆర్ అండ్ బి రోడ్లు త్వరలోనే నిర్మాణమై ఆయా రహదారుల్లో రాకపోకలను సుఖవంతం చేయనున్నాయి.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



మెగా జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా జూలై 4న శుక్రవారం పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 20 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ వంటి విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనాలని కోరారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌నంబర్లు 8465830771, 9963561755 లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్, డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు చైతన్య, లోకేష్, సిసింద్రలతో పాటు టీడీపీ , జనసేన నాయకులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో గూడూరుపల్లె విద్యార్థి ప్రతిభ



విద్యార్థి సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గురుకులం ఆచార్య మణికంఠ

పుంగనూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరుపల్లె ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సతీష్‌కుమార్ చెస్‌పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెచ్ఎం మహేశ్‌నారాయణ తెలిపారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ప్రశంసాపత్రంతో జ్ఞాపిక అందించి సన్మానించారు. గురుకులం ఆచార్య మణికంఠ శిక్షణతో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అమర్ జన్మదినంనాడు అన్నదానానికి విరాళం



ఈవోకు చెక్కును అందిస్తున్న యువరాజులు నాయుడు

ఐరాల(కాణిపాకం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పుట్టినరోజైన జూలై రెండో తేదీ నాడు కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి విచ్చేసే భక్తులకు అన్నదానం చేయడానికి పూతలపట్టుకు చెందిన యువరాజులు నాయుడు రూ. 1,11,111 చెక్కును శనివారం అందించారు. దాతను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాలంకరణలో వైష్ణవిదేవి



చౌడేపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శనివారం వారాహిదేవి నవరాత్రులు సందర్భంగా అమ్మవారు ధూమ్ర వైష్ణవిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి



కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

పుంగనూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రి పారిశుధ్య కార్మికులకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. శనివారం ఆస్పత్రి పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను కాంట్రాక్టర్లకు అప్పగించడంతో సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం కార్మికులను నేరుగా జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారి హరిగోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటరమణారెడ్డి, రామ్మూర్తి, కార్మికులుపాల్గొన్నారు.

రేపు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాము శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సమస్యలపై చర్చించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజారి హరిస్వామి చెన్నకేశవస్వామికి, ఆంజనేయ స్వామికి వివిధ అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



పుంగనూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన ప్రసన్న పార్వతీదేవి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాల శనివారం ఘనంగా జరిగాయి. జూలై 4వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సహకార సంఘాలకు చైర్మన్ల పేర్లు ఖరారు ?



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న టీడీపీ మండల అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి



పగడాల రమణ



ధనంజయనాయుడు



సోమలలో శివశంకర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, సోమల, పుంగనూరు, కల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సహకార సంఘాలకు చైర్మన్ల ఎంపిక జాబితా శనివారానికి ఖరారు చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. చౌడేపల్లె సింగిల్ విండో ఛైర్మన్‌గా పగడాల హరిప్రసాద్, డైరెక్టర్లుగా మునివెంకట రమణ, సుబ్రహ్మణ్యంరాజు పేర్లను ఎంపిక చేశారు. అలాగే సోమల సింగిల్ విండో ఛైర్మన్‌గా శివశంకర్, డైరెక్టర్లుగా సతీశ్, అష్రఫ్ అలీ పేర్లు ఖరారయ్యాయి. వీరిని టీడీపీ నాయకులు శనివారం సోమలలో సన్మానించారు. అలాగే పుంగనూరు సింగిల్ విండో ఛైర్మన్‌గా పగడాల రమణ పేరును ఖరారు చేశారు. వెంకట రమణ, శ్రీనాథరెడ్డిలను డైరెక్టర్లుగా నియమించారు. పులిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా అదే మండలంలోని దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ధనంజయనాయుడు నియామకం కానున్నారు. డైరెక్టర్లుగా పాపిరెడ్డిగారిపల్లికి చెందిన గురప్ప, పెద్ద బెస్తపల్లికి చెందిన జయకుమార్ పేర్లను సంబంధితశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి. చైర్మన్లు, డైరెక్టర్లుగా పేర్లు ఖరారైన నాయకులు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వరసిద్ధుడి భక్తులు ఇబ్బంది పడకూడదు: ఈవో

ఐరాల(కాణిపాకం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలోని వసతి సముదాయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు ఈవో పెంచలకిషోర్ సూచించారు. శనివారం సిబ్బందితో కలసి ఆలయ వసతి సముదాయాన్ని తనిఖీ చేశారు. మంచాలు, రగ్గులు, పరుపులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అసౌకర్యంగా ఉందని భక్తులు ఫిర్యాదుచేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, ధనంజయ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


ఈవోకు చెక్కును అందిస్తున్న యువరాజులు నాయుడు

ఎమ్మెల్యే అమర్ జన్మదినం నాడు అన్నదానానికి విరాళం

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పుట్టినరోజైన జూలై రెండో తేదీనాడు కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి విచ్చేసే భక్తులకు అన్నదానం చేయడానికి పూతలపట్టుకు చెందిన యువరాజులు నాయుడు రూ.1,11,111 చెక్కును అందించారు. దాతను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

బంగారుపాళ్యం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని పూతలపట్టు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కృష్ణకుమారి అన్నారు. శనివారం నలగాంపల్లె పంచాయతీ పిడివి కండ్రిగ జడ్పీ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించే యూనిఫాంను సర్పంచ్ షీబా ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. నాయకులు జయచంద్రనాయుడు, ఎస్సీ శ్యామలమ్మ, నాగరాజగౌడ్, స్వామిదాస్, హెచ్ఎం చిట్టెమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ గుణశేఖర్ పాల్గొన్నారు.

గుడి భూములు సర్వే చేయండి

విజయపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని కోదండ రామస్వామి గుడి భూములను సర్వే చేయాలని తహసీల్దార్ కిరణ్‌కు నారపరాజుకండ్రిగ వాసులు శనివారం వినతిపత్రం అందించారు. సర్వే నెంబరు 397/10లో కొంత గుడి భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మామిడి రైతుల ఇబ్బందులపై కలెక్టర్ ఆరా


ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్

గుడిపాల జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలు తీసుకొచ్చే రైతుల ఇబ్బందులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం తీశారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్‌లు రెండ్రోజులుగా మామిడికాయల అన్‌లోడింగ్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంకేమైనా సమస్యలున్నాయా అంటూ అధికారులతో కలెక్టర్ ఫోన్లో మాట్లాడి, సూచనలిచ్చారు.

రోడ్డు ధ్వంసం.. తరచూ ప్రమాదాలు

- గ్రావెల్ తరలించే టిప్పర్లే కారణమంటున్న స్థానికులు

విజయపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రావెల్ తరలించే టిప్పర్ల కారణంగా మహారాజపురం - కనకమ్మసత్రం రోడ్డు ధ్వంసమవడమే కాకుండా.. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కూడా వేగంగా వస్తున్న టిప్పర్లను తప్పించబోయిన ఓ కారు అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తా పడిందన్నారు. అదృష్టవశాత్తూ అందులోనివారికి ఎటువంటి గాయాలు కాలేదని చెప్పారు.

రాత్రీపగలు గ్రావెల్ తరలింపు

మహారాజపురం రెవెన్యూ నుంచి రాత్రీపగలు వందలకొద్దీ టిప్పర్లు గ్రావెల్ లోడుతో వేగంగా వెళుతుంటాయని స్థానికులు తెలిపారు. వీటివల్ల రోడ్లతోపాటు చెలరేగే దుమ్ము కారణంగా పంటలు నాశనం అవుతున్నాయని చెప్పారు.


మహారాజపురం వద్ద బోల్తాపడిన కారు


రాత్రి సమయంలో టిప్పర్లలో తరలుతున్న గ్రావెల్

టిప్పర్ల వల్లే మహారాజపురం మలుపు వద్ద శ్రీహరిపురానికి తాగునీరు సరఫరా చేసే పైపు లైను లీకేజీకి గురైందన్నారు. రాత్రి సమయంలో టిప్పర్లు వెళుతున్న శబ్దాలకు నిద్ర ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు టిప్పర్ల వేగానికి అడ్డుకట్ట వేసి, రాత్రిపూట గ్రావెల్ తరలింపును ఆపాలని కోరుతున్నారు.


ధ్వంసమైన మహారాజపురం - కనకమ్మసత్రం రోడ్డు

ఒంటికాలిపై నిలబడి కార్మికుల నిరసన



నగరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓవైపు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతుంటే.. మరోవైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఇవ్వక పోవడం సరికాదంటూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట వీరు చేపట్టిన నిరసన శనివారం కూడా కొనసాగించారు. ఒంటికాలిపై నిలబడి నినాదాలు చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

సినిమా థియేటర్లలో ఆర్డీవో తనిఖీలు

నగరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని సినిమా థియేటర్లను నగరి ఆర్డీవో భవానీశంకరి శనివారం తనిఖీ చేశారు. థియేటర్ పరిసర ప్రాంతాల్లో భద్రత, పారిశుధ్యంపై ఆరా తీశారు. పార్కింగ్ ఏరియాను పరిశీలించారు. ప్రేక్షకులకు తినుబండారాల ధరలు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు.


థియేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీశంకరి

వృద్ధులను అక్కున చేర్చుకున్న 'అమ్మఒడి'

బంగారుపాళ్యం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తుంబకుప్పం గ్రామానికి చెందిన నారాయణప్ప, సావిత్రమ్మ అనే వృద్ధులను చూసేవారులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన జ్యోతినాథ్.. అమ్మఒడి ట్రస్టు నిర్వాహకుడు పద్మనాభనాయుడికి తెలియజేశారు. ఆయన శనివారం ట్రస్టు సభ్యులతో గ్రామానికొచ్చి వృద్ధులను అక్కున చేర్చుకున్నారు. అనంతరం వారిని అరగొండ అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. సభ్యులు చండీప్రభ, హంస్సేన్, వాసుదేవన్, మురళి, జరీనా, శోభ పాల్గొన్నారు.

పేదలకు భరోసాగా సీఎం సహాయ నిధి: ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ/తవణంపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు భరోసాగా సీఎం సహాయనిధి ఉంటోందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. శనివారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో కాణిపాకపట్నంకు చెందిన ప్రేమలతకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును అందజేశారు. పార్టీలకు అతీతంగా బాధితులకు సాయం చేస్తున్నట్లు తెలిపారు.


ప్రేమలతకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

120 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు

బంగారుపాళ్యం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో అరగొండ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 120 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇద్దరు విద్యార్థులకు కొలెస్ట్రాల్ అధికంగా ఉండడంతో అపోలో ఆస్పత్రిలో ఉచితంగా చికిత్సలు అందిస్తామని పీఆర్వో కమ్రుద్దీన్ తెలిపారు. ఆస్పత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, పీఆర్వో అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, రాజేష్, ఉపాధ్యాయులు, అపోలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాసామగ్రి వితరణ

విజయపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం 50 మంది విద్యార్థులకు దొమ్మరాజు శ్రీనివాసవర్మ, ధనలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థంగా విశ్రాంత ఎంఈవో జయదేవరాజు విద్యాసామగ్రి వితరణ చేశారు. హెచ్ఎం వెంకమరాజు, విశ్రాంత టీచరు శ్రీధర్‌రాజు, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్‌రాజు, నరేష్, పాల్గొన్నారు.



థామస్‌కు పలువురి శుభాకాంక్షలు

గంగాధరనెల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, విప్ వి.ఎం.థామస్ పుట్టిన రోజు వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. గంగాధరనెల్లూరు పంచాయతీ రామానాయుడుపల్లె వద్ద గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో భారీ కేక్‌ను థామస్ కట్‌చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. శ్రీరంగరాజపురం మండలం సీకేపల్లెలో నలుగురు మనవళ్లు కలిగిన వళ్లెమ్మ అనే వృద్ధురాలికి ఆర్థిక తోడ్పాటుగా లక్ష రూపాయల చెక్‌ను అందజేశారు. గత ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసిన ఆరుగురు కార్యకర్తలకు బ్యాటరీ స్కూటీలను పంపిణీచేశారు. అలాగే బెంగళూరులో ఐబీఎం మేనేజర్‌గా పనిచేస్తున్న గంగాధరనెల్లూరు మండలం ఎ.కనికాపురానికి చెందిన పొదిలి వినోద్‌నాయుడు ఆర్థికతోడ్పాటుతో ఆరుగురు దివ్యాంగులకు రూ.50వేల విలువచేసే బ్యాటరీ ట్రైవీలర్ సైకిళ్లను థామస్ అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ నాయుడి దాతృత్వాన్ని కొనియాడారు. ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి, చుడా చైర్‌పర్సన్ హేమలత, ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, చెరుకూరి వసంత నాయుడు, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, దేవపత్ని ధనంజయనాయుడు, రాంబాబురెడ్డి, కేతినేని లోకేష్ నాయుడు, కామసాని కోదండ రెడ్డి, టీడీపీ యువనేతలు వర్రా యువరాజా రెడ్డి, హరీష్‌యాదవ్, చల్లగుండ్ల దీపక్‌నాయుడు పాల్గొన్నారు.


వినోద్ నాయుడి తోడ్పాటుతో దివ్యాంగులకు బ్యాటరీ ట్రైవీలర్ సైకిళ్లను అందజేసిన థామస్

95శాతం కేఎస్ఎస్ కమిటీల పూర్తి: టీడీపీ

ఐరాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గంలో 95శాతం కేఎస్ఎస్ (కుటుంబ సాధికార సారథుల) కమిటీలను పూర్తి చేసినట్లు నియోజకవర్గ అబ్జర్వర్ బొమ్మన శ్రీధర్ తెలిపారు. శనివారం ఐరాలలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో వంద శాతం కమిటీలను పూర్తి చేస్తామన్నారు. కార్యకర్తలు ఎప్పటికప్పుడు గ్రామాలలో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో టీడీపీ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి దేవాజి, కో-కన్వీనర్ నవీన్, పాలకల అధ్యక్షుడు మునీంద్ర, ప్రధాన కార్యదర్శి సాయిభరత్, యూనిట్ ఇన్‌చార్జి లవకుమార్, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సొప్పా నాని తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలియజేస్తున్న టీడీపీ నేతలు

నేడు పనిచేయనున్న విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్లు

చిత్తూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్లన్నీ యథావిధిగా పనిచేస్తాయని ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న రవియాదవ్

వెదురుకుప్పం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మహేశ్వరి, గురుస్వామి కుటుంబీకుల వితరణతో భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షులు మేళం రవి యాదవ్, ప్రధానకార్యదర్శి బి.గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షుడు కె.రవిరెడ్డి, కోశాధికారి కె.లక్ష్మీపతి, ఉపకోశాధికారి ఆర్.సాయిరాయల్ పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా..

స్వాగతం.. పిల్లలూ..



పెనుమూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు అంగన్వాడీ కేంద్రంలో స్వాగతం.. పిల్లలూ అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కేంద్రానికి వచ్చే పిల్లలకు ప్రేమతో స్వాగతం పలకాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ రెడ్డి కళ్యాణి అన్నారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన పిల్లలకు పూలను అందజేసి, స్వాగతం పలికారు. మోడల్ స్కూల్ హెచ్ఎం యామిని, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పప్పుదినుసుల కిట్లు సిద్ధం

నగరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ రైతులకు పంపిణీ చేయడానికి పప్పుదినుసుల కిట్లు సిద్ధంగా ఉన్నాయని నగరి నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ తెలిపారు. కిట్‌లో మినుములు, పెసర, అలసందలు, రాగులు, సజ్జలు, కొర్రలు, మొక్కజొన్న, జనుము, జీలగ.. ఇలా 25 రకాల విత్తనాలున్నాయని తెలిపారు. ఎం.కొత్తూరు రైతు సేవా కేంద్రంలో వీటిని పొందవచ్చని సూచించారు.

పీర్లకు పూజలు



యాదమరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా యాదమరిలోని పక్టిక్ ముస్లింవాడలో శుక్రవారం రాత్రి పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నిలబెట్టారు. 10 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో 9, 10వ రోజులు అత్యంత పవిత్రమైనవిగా పరిగణించి పీర్లతో అగ్నిగుండం తొక్కి, ఊరేగిస్తారు. ఈ రోజుల్లో ఉపవాసాలు పాటించి, అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు అభినందన



నగరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో నిర్వహించిన తల్లికి వందనం పోటీల్లో అక్షర పాఠశాలకు చెందిన విద్యార్థులు రక్షితశ్రీ, గుణశ్రీ, లోహిత్, భరత్, శ్రీదేవ్, చాణక్యలక్ష్మి ప్రతిభ చూపారు. పైగా జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవడంతో వీరిని శనివారం ఎంఈవో శ్రీదేవి అభినందించారు.

రిటైర్డు డ్రైవరుకు సత్కారం

చిత్తూరు కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డ్రైవర్‌గా పనిచేసి రిటైరైన ధనంజయను శనివారం సత్కరించారు. డీఎంహెచ్‌వో సుధారాణి, టీబీ కంట్రోల్ అధికారి వెంకటప్రసాద్, మలేరియా అధికారి అనిల్ కుమార్, ఎస్‌వో జార్జ్, సూపరింటెండెంట్ గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువలు నిర్మించండి

గుడిపాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 197 రామాపురంలో కాలువలను నిర్మించాలని శనివారం జిల్లా పంచాయతీ అకౌంట్ అధికారి మహీముద్దీన్‌ను బీజేపీ జిల్లా నాయకుడు చిట్టిబాబు కలిసి వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా కాలువ లేక స్థానికులు రోగాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చెత్త సేకరణ పనుల తనిఖీ



వెదురుకుప్పం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పాతగుంటలో చెత్త సేకరణ పనులను ఎంపీడీవో పురుషోత్తం శనివారం తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యదర్శి ధనలక్ష్మి, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.